

నిశ్చింతగా సాగుతున్న రైతులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నుంచి వ్యవసాయం పండగలా మారింది. - 8లో



ఓటు తొలగించే ముందు...

ఓటర్ల జాబితా నుంచి ఎవరిదైనా ఓటు తొలగించేముందు నోటీసు ఇవ్వాలని జేసీ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. - 8లో

థియేటర్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న థియేటర్ అసిస్టెంట్స్ -2, ఆడియోమెట్రిసిన్ పోస్టులు-2కు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని డీసీహెచ్‌ఎస్ జి.గౌరీశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.


న్యూస్‌రీల్

ఉద్యోగుల గ్రీవెన్స్ రేపు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఈ నెల 21న ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తామని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల 3వ శుక్రవారం గ్రీవెన్స్ ఉంటుందన్నారు. ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు తోటపల్లి నీరు విడుదల

- ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు



తోటపల్లి ప్రాజెక్టు

వీరఘట్టం: ఖరీఫ్ పంటల సాగుకు తోటపల్లి ప్రాజెక్టు నీటిని గురువారం విడుదల చేయనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు పాలకొండ, కురుపాం, రాజాం ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి, కంబాల జోగులు భాగస్వాములు కానున్నారు. జలాశయంలో పుష్కలంగా నీరు ఉందని, పార్వతీపురం మన్యంతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 64వేల ఎకరాల పాత ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు సరఫరా చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. తొలుత శివారు ఆయకట్టుకు సాగునీరందించే ప్రధాన చెరువులకు తోటపల్లి నీటిని మళ్లించనున్నారు.

ముగ్గురు ఉద్యోగులకు మెమోలు



దారపాడు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: దోనుబాయి, దారపాడు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాల్లో నాణ్యత లోపంపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయా గ్రామాల్లో పీఓ బుధవారం పర్యటించారు. వారం రోజుల్లో నాణ్యతా ప్రమాణాలతో భవన నిర్మాణాలు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నపల్లంకి, పెద్దపల్లంకి గ్రామాలను సందర్శించారు. మలేరియా, డెంగీ కేసుల నమోదులో నిర్లక్ష్యంపై వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. మెడికల్ ఆఫీసర్, ఏఎన్‌ఎం, సీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌హెచ్‌పీ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

వైఎస్సార్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజిక సేవలు, కార్యక్రమాలు, ప్రజా వ్యవహారాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, వాణిజ్యం, పరిశ్రమలు, ఔషధాలు, సాహిత్యం, విద్య, పౌరసేవ, క్రీడలు వంటి రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారికి వైఎస్సార్ పురస్కారాలు ప్రదానం చేస్తారన్నారు. గ్రామ/మురిక వాడల అభివృద్ధికి కృషిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, లాభాపేక్షలేని సంస్థలకు సంబంధించిన వ్యక్తులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల వారు ఆగస్టు 5వ తేదీలోగా సెట్విజ్ కార్యాలయంలో సంబంధిత వివరాలను జతచేసిన దరఖాస్తులను అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 9849913090 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పురుడుపోసిన 108 సిబ్బంది



తల్లీబిడ్డలను ఏరియా ఆస్పత్రికి తరలిస్తూ..

సీతంపేట: మండలంలోని పెద్దగూడ గ్రామానికి చెందిన గర్భిణి నిమ్మక జ్యోతికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్‌చేశారు. వెంటనే వాహన సిబ్బంది చేరుకుని గర్భిణికి ప్రాథమిక వైద్యం అందజేశారు. సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. వైద్యాధికారుల సూచన మేరకు ఈఎంటీ రమేష్‌బాబు, పైలెట్ శంకరరావు వైద్యసేవలందించి సుఖప్రసవం చేశారు. తల్లీబిడ్డలను ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు.

గృహనిర్మాణాలు శరవేగం

- వైఎస్సార్ జగనన్నకాలనీల్లో పనుల పరుగు
- నెరవేరుతున్న పేదల సొంతింటి కల
- ఇళ్ల నిర్మాణ పురోగతిలో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా ముందంజ
- ప్రతీ శనివారం హౌసింగ్ డే
- జిల్లాలో 21,974 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు
- లే అవుట్‌లో నీటి సరఫరాకు రూ.4.26 కోట్లు
- లబ్ధిదారులకు 5,28,964 బస్తాల సిమెంట్ అందజేత
- 15,31,230 కేజీల ఐరన్ సరఫరా
- జిల్లాలో 9,882 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- పేదల సొంతింటి కలపై ప్రతిపక్షం బురదజల్లే ప్రయత్నం

పార్వతీపురంటౌన్:

పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు లక్ష్యం. నవరత్న పథకాల్లో 'పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని చేర్చింది. కొత్త ఊళ్లు వెలిసేలా లే అవుట్లు వేసింది. లక్షలాది రూపాయలు విలువచేసే స్థలాలను పేదలకు కేటాయించింది. ఇళ్ల నిర్మాణాలకు వీలుగా లే అవుట్లలో దశలవారీగా మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. లబ్ధిదారులకు రాయితీపై ఇంటి నిర్మాణ సామగ్రిని సమకూర్చుతోంది. బిల్లులను చకచకా చెల్లిస్తోంది. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తోంది. పల్లెలు, పట్టణాలకు సమీపంలో కొత్త ఊళ్లు వెలస్తున్నాయి. పేదల సొంతింటి కల నెరవేరుతున్న వేళ.. ఈనాడు తన సిరాతో విషం చిమ్ముతోంది. ఇళ్ల నిర్మాణాలపై పేదల్లో నిరాసక్తి కల్పించే కథనాలు వండివార్చుతోంది. పేదలు బాగుపడకూడదన్నదే ప్రధాన ఉద్దేశంగా కల్పిత కథనాలు అల్లుతోంది. గత టీడీపీ ప్రభుత్వం పేదల గురించి ఏనాడూ పట్టించుకోలేదు. కనీసం వారి సంక్షేమానికి, ఆర్థికోన్నతి కోసం ఒక్క పథకమూ అమలుచేయలేదు. అప్పుడు మిన్నకున్న ఈనాడు.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద పిల్లల చదువుల కోసం.. పేదల ఆర్థికోన్నతికోసం అహర్నిశలు చేస్తున్న కృషితో లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక విషపు రాతలు అచ్చువేస్తోందని ప్రజలు ఛీ కొడుతున్నారు.



పార్వతీపురం మండలం నర్సిపురంలో సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు

టీడీపీ అధికారంలోకి వస్తే పేదలకు అందాల్సిన ప్రజాధనాన్ని లూటీచేసేందుకే ఇలాంటి రాతలు రాస్తోందని విమర్శిస్తున్నారు.

పనుల పరుగు...

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన 21,974 మంది లబ్ధిదారులకు 485 లేవుట్లలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. పార్వతీపురంలో 11,439, సాలూరులో 9,192, కురుపాంలో 3,013, పాలకొండలో చేపట్టిన 3,498 ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటివరకు 9,882 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇళ్ల నిర్మాణాల ప్రగతిలో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిచింది. పూర్తయిన, వివిధ స్థాయిలోని నిర్మాణాల కోసం ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.229.78 కోట్ల బిల్లులు చెల్లించింది. ఇప్పటి వరకు లేఅవుట్‌లలో నీటి సరఫరాకు రూ.3.78 కోట్లు ఖర్చుచేసింది. లబ్ధిదారులకు 5,28,964 బస్తాల సిమెంట్, 15,31,230 కేజీల స్టీల్‌ను అందజేసింది. ఈనాడు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని తెలియజేసేందుకు పార్వతీపురం మన్యం జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణాలే నిదర్శనం.

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల బిల్లులు, మౌలిక సదుపాయాల కల్పన ఇలా..

ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు	రూ.229.78 కోట్లు
నీటి సరఫరాకు చేసిన వ్యయం	రూ. 3.78 కోట్లు
స్థల సేకరణకు చేసిన ఖర్చు	రూ. 9.39 కోట్లు
అందజేసిన సిమెంట్	5,28,964 బస్తాలు
సమకూర్చిన స్టీల్	15,31,230 కేజీలు
అప్రోచ్ రోడ్లకు చేసిన ఖర్చు	రూ.3.92 కోట్లు

జిల్లాలో లబ్ధిదారులు ఇలా

మండలం	లబ్ధిదారుల సంఖ్య
కొమరాడ	2,004
గరుగుబిల్లి	541
కురుపాం	179
జియ్యమ్మవలస	289
బలిజిపేట	3,253
పార్వతీపురం	2,623
పార్వతీపురం అర్బన్	2,903
సీతానగరం	2,660
మక్కువ	1922
పాచిపెంట	1587
సాలూరు	2,387
సాలూరు అర్బన్	3,296
పాలకొండ అర్బన్	1896
పాలకొండ	479
భామిని	328
వీరఘట్టం	795

గత పాలనకు భిన్నంగా..

గత ప్రభుత్వ పాలనకు పూర్తి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం సహకారం అందిస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం కోసం రూ.1.50 లక్షలు చెల్లించినా అది రుణంగా తిరిగి చెల్లించాల్సి వచ్చేది. సిమెంట్ మాత్రమే సరఫరా చేసేది. ప్రస్తుతం ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లిస్తోంది. ఈ సొమ్మును తిరిగి రుణంగా చెల్లించాల్సిన అవసరం లేదు. దీనికితోడు సిమెంట్, ఇనుప కమ్మీ, తలుపులు, కిటికీలు అందిస్తోంది. గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాలు చూపి చేతులు దులుపుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించింది. ప్రధానంగా బిల్లుల చెల్లింపు సకాలంలో చేస్తున్నారు. పెండింగ్ మాట లేకుండా లబ్ధిదారుల ఇంటి నిర్మాణ స్థాయినిబట్టి బిల్లుల నగదును వారి ఖాతాలకు జమ చేస్తోంది ప్రభుత్వ చర్యలతో నిర్మాణ పనుల వేగం అందుకున్నాయి.

మౌలిక సదుపాయాలు కల్పించాం




జిల్లాలో జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన దశలవారీగా సాగుతోంది. ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యాయి. లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతున్నాం. ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. నిర్మాణపనుల్లో వేగం పెంచుతున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తిచేయాలన్నదే లక్ష్యం.

– టి.రమేష్, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ, పార్వతీపురం మన్యం

ప్రతి శనివారం ప్రత్యేకపర్యవేక్షణ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల నిర్మాణాలపై జిల్లా అధికార యంత్రాంగం ప్రతి శనివారం హౌసింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అధికారులు క్షేత్ర స్థాయి పనులు పర్యవేక్షిస్తూ పరుగులు పెట్టిస్తున్నారు. గతంలో పేదలకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కలెక్టర్ స్థాయిలో తనిఖీలు, పరిశీలనలు అరుదుగా ఉండేవి. కలెక్టర్ నిషాంత్ కుమార్ ఇళ్ల నిర్మాణాలు, కల్పించిన సౌకర్యాలు, విద్యుత్, నీటి వసతులపై ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. ఎక్కడికక్కడ లబ్ధిదారులను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.



పాలకొండలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో జోరుగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు

శిశుఆరోగ్యానికి అండగా ఎస్‌ఎన్‌సీయూ

సీతంపేట: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూ (స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్) శిశు ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది. తక్కువ బరువు, వివిధ ఆరోగ్య సమస్యలతో జన్మించిన శిశువులకు ప్రాణం పోస్తోంది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం పొన్నానపేట గ్రామానికి చెందిన గర్భిణి గొడ్డు మాధవి 32 వారాలకే సుఖప్రసవంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కేవలం 1.5 కిలోల బరువు మాత్రమే ఉండి అనారోగ్య స్థితికి శిశువు చేరుకుంది. వెంటనే సీతంపేట ఎస్‌ఎన్‌సీయూ యూనిట్‌లో గత నెల 24న చేర్పించారు. 26 రోజుల పాటు వైద్యులు ప్రత్యేక వైద్యసేవలు అందజేశారు. కేఎంసీ, వార్మర్ కేర్, విటమిన్‌డి-3, మల్టీ విటమిన్ డ్రాప్స్, ఫొటోగ్రఫీ వంటివి చేయడంతో శిశువు 2.5 కిలోల బరువు పెరిగి ఆరోగ్యకరంగా ఉండడంతో ఎస్‌ఎన్‌సీయూ నుంచి బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఆస్పత్రి వైద్యులకు మాధవితో పాటు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యులు వెంకటరావు, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.



తల్లీబిడ్డను ఎస్‌ఎన్‌సీయూ నుంచి డిశ్చార్జ్ చేస్తున్న వైద్యబృందం

అర్హతే ప్రామాణికంగా రైస్ కార్డులు





ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- ప్రతీ ఆరు నెలలకు అర్హులకు కొత్తకార్డులు
- రేషన్‌కార్డుల జారీపై ఎల్లో మీడియా దుష్ప్రచారం
- నాలుగేళ్లలో జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన రైస్ కార్డులు: 14,947
- జిల్లాలో మొత్తం రైస్‌కార్డులు: 2,76,787

పార్వతీపురంటౌన్:

కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయడంలో జగనన్న ప్రభుత్వం మార్కుపాలనను సొంతం చేసుకుంది. అర్హత ఉండి కొన్నికారణాలతో లబ్ధిపొందని వారికి జగనన్న సురక్ష కింద రోజుల వ్యవధిలోనే కార్డులు మంజూరు చేస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో 14,947 కుటుంబాలకు కొత్తగా రైస్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతీ ఆరునెలలకోసారి జారీ చేస్తున్న కార్డులను అర్హులు సొంతం చేసుకుంటున్నారు. రైస్ కార్డుతో రేషన్ సరుకులతో పాటు రాయితీలు అందుకుంటున్నారు.

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రేషన్‌కార్డు మంజూరైందంటే అదో పెద్ద వరం. నాయకులు, జన్మభూమి కమిటీల కాళ్లు పట్టుకోవాలి. వారి సిఫార్సుల మేరకు అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అప్పటికీ మంజూరవుతుందోలేదో తెలియదు. కొత్త కుటుంబాలు కార్డు కోసం కళ్లుకాయలు కాచేలా ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులకు ఆ కష్టాలన్నీ దూరమయ్యాయి. సచివాలయ వ్యవస్థతో ఊరిలో ఉన్న సచివాలయంలో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దరఖాస్తు చేసిన రోజుల వ్యవధిలో ధ్రువపత్రాలు, కార్డులు జారీ అవుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వానికి ప్రజాదరణ పెరుగుతోంది. దీనిని చూసి ఓర్వలేని ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్నవేళ.. లేనివి ఉన్నట్టు అక్షరాలతో కనికట్టుచేస్తోంది. తప్పుడు కథనాలతో విషం చిమ్ముతోంది.

గత నాలుగేళ్లుగా మంజూరు చేసిన కొత్త కార్డులు ఇలా...

మండలం	2019-2021	2022లో
బలిజిపేట	996	139
గరుగుబిల్లి	977	63
గుమ్మలక్ష్మీపురం	776	75
జియ్యమ్మవలస	712	55
కొమరాడ	1089	73
కురుపాం	701	74
మక్కువ	785	72
పాచిపెంట	866	79
పార్వతీపురం	1439	247
సాలూరు	1100	113
సీతానగరం	940	133
భామిని	696	90
పాలకొండ	616	119
సీతంపేట	787	108
వీరఘట్టం	914	96

జిల్లాలో కార్డులు ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 2019లో జిల్లాలో ప్రస్తుతం ఉన్న నాలుగు నియోజకవర్గాల్లో కలిపి 2,61,840 రేషన్ కార్డులు ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 2,76,787కి చేరింది. కొత్తగా మంజూరవుతున్న రైస్ కార్డుదారులకు వచ్చేనెల నుంచి రేషన్ సరుకులు అందనున్నవి.

అర్హులందరికీ కొత్త రైస్ కార్డులు



ప్రతీ ఆరు నెలలకు కొత్త రైస్ కార్డులు మంజూరు చేస్తున్నాం. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా అందకపోతే జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్ కార్డుల్లో సభ్యులు పేర్లు చేర్పులు, తొలగింపు వంటివి కూడా చేస్తున్నాం. అందుబాటులోని సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటే అర్హతలు పరిశీలించి కార్డులు అందజేస్తున్నాం.

– ఆర్.గోవిందరావు, జాయింట్ కలెక్టర్, పార్వతీపురం మన్యం

22,23 తేదీల్లో విశాఖలో రాష్ట్ర గిరిజన ఉత్సవాలు

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: విశాఖపట్నంలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్ర గిరిజన ఉత్సవాలు నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. సాలూరు పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఉత్సవాల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గిరిజన సంస్కృతి పరిశోధన సంస్థ నేతృత్వంలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయంతో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. 22వ తేదీ సాయంత్రం 5 గంటలకు విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరినాలో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. రెండు రోజులపాటు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఉత్సవాలు సాగుతాయన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల గిరిజన సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, నృత్యాలు, సంగీతం, అరకు కాఫీ, మ్యాంగో షో వంటి ప్రత్యేక ప్రదర్శనలు, చిత్రలేఖన పోటీలు, గిరిజన ఔత్సాహిక, పారిశ్రామి వేత్తలకు సత్కారాలు వంటివి ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంస్కృతి పరిశోధన సంస్థ ఈడీ చినబాబు, ప్రొఫెసర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర గిరిజన ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

రంగప్పవలసలో ఏనుగులు

- 10 ఎకరాల్లో వరినారు, మొక్కజొన్న పంటలు ధ్వంసం

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామానికి సమీపంలోని మామిడి తోటల్లో ఏనుగుల గుంపు తిష్టవేసింది. రంగప్పవలస గ్రామంలోని మొక్కజొన్న, వరినారు మడులను మంగళవారం రాత్రి ధ్వంసం చేయడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులు అటవీప్రాంతంలోకి మళ్లించే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ శనపతి రాంబాబుతో పాటు రైతులు కోరారు.



తమ్మయ్యవలస మామిడి తోటలో సంచరిస్తున్న ఏనుగులు



రంగప్పవలసలో వరి నారు మడిని తొక్కేసిన ఏనుగుల గుంపు

జోరు వాన

భామిని: పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నదులకు వరద తాకిడి పెరిగింది. జిల్లాలోని 15 మండలాల్లో సగటున 579 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసినట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



భామిని మండలంలో పొలాల్లోకి చేరిన వర్షపునీరు



వంశధార నదిలో పెరుగుతున్న నీటి మట్టం

మండలాల వారీగా బుధవారం నమోదైన వర్షపాతం ఇలా...

మండలం	వర్షపాతం (ఎం.ఎం)
వీరఘట్టం	58.6
సీతంపేట	68.8
భామిని	42.8
పాలకొండ	54.6
కొమరాడ	30.4
జి.ఎల్.పురం	36.4
కురుపాం	31.6
జియ్యమ్మవలస	28.6
గురుగుబిల్లి	37.2
పార్వతీపురం	25.2
మక్కువ	16.6
సీతానగరం	31.2
బలిజిపేట	48.6
సాలూరు	33.6
పాచిపెంట	34.8

క్లుప్తంగా

జీసీఎస్ఆర్ కళాశాలకు నాక్ గుర్తింపు



నాక్ ఉత్తర్వులు అందుకుంటున్న ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్(నాక్) గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తం తెలిపారు. ఈ మేరకు బుధవారం నాక్ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు అందాయని చెప్పారు. ఇటీవల పర్యటించిన బృందం కళాశాలలో మౌలిక సదుపాయాలు, వాతావరణం పరిశీలించిన అనంతరం కళాశాలకు బి ప్లస్ గ్రేడుతో గుర్తింపు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. దీంతో మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో కళాశాల అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. నాక్ గుర్తింపు రావడంపట్ల జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జి.గిరీష్, సీఈఓ లక్ష్మణమూర్తి తదితరులు ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

ప్రయోగశాల పరికరాల సరఫరాకు టెండర్లు



డీఎంహెచ్ఓ బగాది జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రయోగ శాల పరికరాలు, ర్యాపిడ్ టెస్ట్ కిట్స్, ఇతర పరికరాలు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. బగాది జగన్నాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 42 రకాల ప్రయోగశాల పరికరాలు అవసరమని చెప్పారు. ఆయా పరికరాలను టెండరు ప్రక్రియ ద్వారా సమకూరుస్తామని స్పష్టం చేశారు. టెండరు దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://పార్వతీపురం మన్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ నుంచి పొందవచ్చని, ఈ నెల 20వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ లోగా దరఖాస్తు పొందాలని స్పష్టం చేశారు. టెండర్ దరఖాస్తులను ఆగస్టు 3వ తేదీ లోగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: ఐటీ యాక్ట్ కింద కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక పావని నగర్‌లో నివాసం ఉంటున్న రాయవరపు శిరీషానాయుడు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన వ్యక్తి గిఫ్ట్‌లు పంపిస్తానని నమ్మబలికి కస్టమ్ డిపార్ట్‌మెంట్ యూజర్ చార్జీలు కట్టాలని చెప్పడంతో దపదఫాలుగా నగదు బదిలీ చేశారు. అలాగే ఇండియన్ కరెన్సీని యుఎస్ డాలర్స్ కింద మారుస్తానని నమ్మబలకడంతో నగదు బదిలీ చేశారు. చివరికి తాను మోసపోయినట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసులను ఆమె బుధవారం ఆశ్రయించారు. ఇప్పటివరకూ రూ. 68 లక్షల 46వేలకుపైగా నగదు బదిలీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ వెంకటరావు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన రమణ

గంట్యాడ: మండలంలోని పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన ఆరుగురు ఆటోపై రాయిగడ వెళ్తుండగా రామవరం వద్ద టిప్పర్ లారీ ఢీకొట్టడంతో గాయపడిన ఆటో డ్రైవర్ సైలాడ రమణ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,100-00
బంగారం(22కి. 10గ్రా.)	55,100-00
వెండి (కిలో)	81,400-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

నిశ్చింతగా సాగుతున్న రైతులు

ఫ్యాక్ట్ చెక్

- నాలుగేళ్లుగా తోటపల్లి సాగునీరు పుష్కలంగా పంపిణీ
- శివారు ఆయకట్టులో పెరిగిన పంటల దిగుబడి
- టీడీపీ హయాంలో సాగు నీటి కోసం రైతుల అవస్థలు

- ప్రస్తుతం ప్రణాళిక ప్రకారం సాగునీటి విడుదల
- పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ
- తోటపల్లి అభివృద్ధిని చూడలేక ఈనాడు తప్పుడు రాతలు
- జలవనరులశాఖ అధికారుల ఆగ్రహం



తోటపల్లి జలాశయం పరిధిలో లైనింగ్ పనులు పూర్తయిన ఎడమ ప్రధాన కాలువ



ఎడమకాలువలో పటిష్టంగా ఉన్న 1వ బ్రాంచ్ షట్టర్



పూడికలు తీసిన 6వ బ్రాంచ్ కాలువ



సాగునీటి పంపిణీ కోసం 7వ బ్రాంచ్ కాలువల్లో జేసీబీతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ శుభ ముహూర్తాన రాష్ట్రంలో అధికారం చేపట్టిందో అప్పటి నుంచి వ్యవసాయం పండగలా మారింది. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పాత ఆయకట్టుకు తోటపల్లి జలాశయం ఏటా ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయిలో సాగు నీరందిస్తూ పంటలను సస్యశ్యామలం చేస్తోంది. నాలుగేళ్లుగా ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా జలవనరులశాఖ అధికారులు ప్రణాళికా బద్ధంగా సాగునీటిని పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా కాలువల ఆధునికీకరణ పనులు చేపడుతూనే సాగునీటిని పంపిణీ చేస్తున్నారు. అయితే వాస్తవ పరిస్థితులను విస్మరిస్తూ బుధవారం 'ఈనాడు' పత్రికలో తోటపల్లి కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి, షట్టర్లు లేవు లష్కర్లు లేరు ఈ ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకంగా మారడంతో సాగునీటి కోసం ఆయకట్టు రైతుల ఆందోళన చెందుతున్నారనే విషపు కథనాన్ని ప్రచురించడంపై జలవనరులశాఖ అధికారులు మండిపడుతున్నారు.

2020లో తోటపల్లి ఆధునికీకరణ పనులకు శ్రీకారం..

2019లో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అరకొర పనులు ఆగిపోయాయి. దీంతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ప్రస్తుత ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు తోటపల్లి కాలువల ప్రాధాన్యతను, ఇక్కడి రైతులు, పంటల పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ పాలనలో జరిగిన పొరపాట్లను సవరిస్తూ తోటపల్లి కాలువలకు రూ.193.58 కోట్లు నిధులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తక్షణమే మంజూరు చేసింది. అంతేకాకుండా టీడీపీ హయాంలో జరిగిన అరకొర పనులకు కూడా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించింది. తర్వాత చకచకా పనులు ప్రారంభించింది.

ప్రధాన కాలువల్లో బాగానే ఉన్న షట్టర్లు

తోటపల్లి కుడి, ఎడమ కాలువల్లో ప్రధాన బ్రాంచిల వద్ద షట్టర్లు బాగానే ఉన్నాయి. ఎడమ కాలువలో మొత్తం ఎనిమిది బ్రాంచ్‌లు ఉండగా అందులో 5వ బ్రాంచ్ షట్టరు మరమ్మతుల బారిన పడింది. మిగిలిన అన్ని బ్రాంచ్‌ల షట్టర్లు బాగానే ఉన్నాయి.

టీడీపీ పాలనలో అంతా కరువే..

గత టీడీపీ పాలనలో తోటపల్లి ఆయకట్టు రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టిన ఏడాదే అక్టోబర్ 8 నుంచి 14 వరకు హుద్‌హుద్ తుఫాన్ విలయ తాండవం చేసి వరిపంటకు తీవ్రనష్టాన్ని చేకూర్చింది. ఈ తుఫాన్‌లో పంటలు నష్టపోయిన నిజమైన రైతులను విస్మరించి టీడీపీ నాయకులు వారి బినామీల పేర్లు నమోదు చేసి పంటల పరిహారాన్ని స్వాహా చేశారు. అలాగే 2015లో నవంబర్‌లో చావ్లా తుఫాన్ ప్రభావంతో పంటలకు నష్టం కలిగింది. మరుసటి ఏడాది 2016 ఆగస్టు 18న తోటపల్లి ఎడమకాలువ పరిధి పెద్దబుడ్డిడి గ్రామం వద్ద ఉన్న బ్రిటిష్ కట్టడం సైఫన్‌కు భారీగా గండిపడింది. దీంతో సైఫన్‌కు దిగువన ఉన్న 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ప్రశ్నార్థకంగా మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే 2017 ఖరీఫ్‌లో ఫణి తుఫాన్ పంటలను అతలాకుతలం చేసింది. 2018 అక్టోబర్ 8 నుంచి 12 వరకు సంభవించిన తిత్లీ తుఫాన్ ధాటికి పంటలు సమూలంగా నేలమట్టమయ్యాయి. ఇలా 2014 నుంచి 2018 వరకు చంద్రబాబు పాలనలో రాష్ట్రవ్యాప్తంగా కరువు ఏర్పడడంతో పాటు తోటపల్లి పాత ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయినప్పటికీ తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణకు చంద్రబాబు ప్రభుత్వం ముందుకు రాలేదు. 2019లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆదరాబాదరాగా నిధులు మంజూరు చేసి వీరఘట్టం మండలం అచ్చెపువలస వద్ద శంకుస్థాపన పనులు చేపట్టి రైతులను మోసగించే ప్రయత్నం చేసింది. గత టీడీపీ పాలనలో విసిగిపోయిన రైతులు 2019లో ఆ పార్టీకి బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారు.

ఏటా లష్కర్ల నియామకం



లష్కర్ల కొరత కొన్ని దశాబ్దాలుగా ఉంది.ప్రస్తుతం తోటపల్లి కుడి,ఎడమ కాలువల పరిధిలో 30 మంది లష్కర్ల అవసరం ఉంది.అయితే 8 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన వారిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఏటా నియమిస్తున్నాం. ప్రస్తుతం లష్కర్లు కావాలనే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. కొద్ది రోజుల్లో నియమిస్తాం.

– దమలపాటి రవికుమార్, డీఈఈ జలవనరులశాఖ, పాలకొండ డివిజన్

అలాగే కుడికాలువలో ఉన్న 11 బ్రాంచ్‌లలో అన్ని షట్టర్లు బాగానే ఉన్నాయి.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులపై దృష్టి సారించింది.37.536 కి.మీల పొడవున్న ఎడమ కాలువలో ఇంతవరకు 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. అలాగే 17.616 కి.మీల పొడవున్న కుడికాలువలో 9.376 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టారు.మొత్తం 55.152 కి.మీలకు గాను 48 శాతం 26.919 కి.మీ పనులు పూర్తి చేశారు. అంతేకాకుండా బ్రాంచి కాలువల్లో పూడికలు తీయిస్తూ నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా ఒక పక్క కాలువల ఆధునీకీకరణ పనులు నిర్వహిస్తూ మరో పక్క గడిచిన నాలుగేళ్లుగా సకాలంలో కాలువలకు సాగునీరందిస్తూ ప్రభుత్వం తోటపల్లి ఆయకట్టును సస్యశ్యామలం చేస్తుంటే నీటి సమస్య అంటూ ఈనాడు తప్పుడు వార్తలు రాస్తుండడం ఎంతవరకు సమంజసమని జలవనరులశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థులకు మెరిట్ కార్డుల జారీ



డీఈఓ ప్రేమ్ కుమార్

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు నేషనల్ స్కాలర్ షిప్ మెరిట్ కార్డులను జారీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ స్కాలర్ షిప్‌లో అర్హత పొందిన వారికి మెరిట్ కార్డులు జిల్లాకు చేరాయని ఆయన తెలిపారు. విద్యార్థులు గాని, ఆయా పాఠశాలల సిబ్బంది కానీ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి వచ్చి మెరిట్ కార్డులను పొందాలని కోరారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ మళ్లీ త్వరలో మొదలవుతుందని స్పష్టం చేశారు. స్కాలర్ షిప్‌కు ఎంపికైన ప్రతి విద్యార్థి జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరు, తల్లి లేదా తండ్రితో ఉమ్మడిగా ఖాతాను తెరవాలని సూచించారు. ఆధార్ కార్డు జత చేయాలని పేర్కొంటూ సేవింగ్ అకౌంట్ మాత్రమే ఉండాలని చెప్పారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ మెరిట్ కార్డులో ఉన్నట్టే, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకంలో ఉండాలని, అప్పుడే స్కాలర్ షిప్ డబ్బులు ఖాతాలో జమ అవుతాయని వివరించారు. మరిన్ని వివరాలకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

27న స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్వయం ఉపాధి ఉచిత శిక్షణకు ఈ నెల 27న జీఎంఆర్ నైరెడ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పురుషులకు బైక్ మెకానిక్, సెల్‌ఫోన్ రిపేరింగ్ (30 రోజులు), కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. స్త్రీలకు లేడీస్ టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ బేసిక్స్ అండ్ టాలీలో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఇంటర్వ్యూకు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో హాజరు కావాలని సూచించారు. శిక్షణ ఆగస్టు 1 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8247732416, 9014716255, 9491741129, 9494952586 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డిప్లమో విద్యార్థి ఆత్మహత్య



సందీప్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: పరీక్షల్లో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు ఏమైనా అంటారన్న భయంతో ఓ డిప్లమో విద్యార్థి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయనగరంలోని వైఎస్సార్‌నగర్‌లో జరిగిన ఈ సంఘటనపై టూటౌన్ సీఐ విజయానంద్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ నగర్‌కు చెందిన ఇమంది సందీప్ (19) గజపతినగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిప్లమా చదువుతున్నాడు. 15 రోజుల క్రితం వెలువడిన థర్డ్ ఇయర్ డిప్లమో ఫలితాల్లో ఫెయిలయ్యాడు. ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియకుండా గోప్యంగా ఉంచాడు. అయితే ఫలితాలు విడుదలైనట్లు తల్లిదండ్రులకు తెలియడంతో తనను ఏమైనా అంటారేమోనన్న భయంతో ఈ నెల 17న రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, కనబడకుండాపోయాడు. అనంతరం ఫలితాల్లో ఫెయిలైనందున తల్లిదండ్రులు ఏమైనా అంటారేమోనన్న భయంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన మిత్రుడి మొబైల్‌కు మెసెజ్ పంపించాడు. దీంతో మిత్రుడు ఆ సమాచారాన్ని వెంటనే సందీప్ తల్లిదండ్రులకు తెలియపరిచాడు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు సందీప్ ఆచూకీ కోసం ఎంత వెతికినా తెలియరాలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు 18న ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో బుధవారం వైఎస్సార్ నగర్ సమీపంలో ఓ నేలబావిలో సందీప్ మృతదేహం లభ్యమైంది. మృతుని తండ్రి సూర్యప్రకాశరావు జూట్‌మిల్లులో లేబర్‌గా పనిచేస్తున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ పి.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి యువకుడు..

మెంటాడ: మండలంలోని కైలాం గ్రామానికి చెందిన గండి మురళి (27) పురుగు మందు తాగి బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గడ్డిమందు తాగి మరో యువకుడు..



కోడూరు గణేష్ (ఫైల్)

గజపతినగరం రూరల్: మండలంలోని కొత్తబగ్గాం గ్రామానికి చెందిన కోడూరు గణేష్ (25) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. అప్పుల బాధ తాళలేక గణేష్ మంగళవారం రాత్రి పురుగు మందు తాగడాన్ని గమనించిన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తల్లి కోడూరు సన్యాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజపతినగరం హెచ్‌సీ శ్రీనువాస నాయుడు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

ఓటు తొలగించే ముందు నోటీసు ఇవ్వాలి

- జేసీ మయూర్ అశోక్



హాజరైన బీఎల్‌ఓలు



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ఓటర్ల జాబితా నుంచి ఎవరిదైనా ఓటు తొలగించేముందు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. మరణించిన ఓటర్ల పేర్లను కూడా, సంబంధిత కుటుంబానికి నోటీసు ఇచ్చిన తరువాత మాత్రమే తొలగించాలని స్పష్టం చేశారు. ఇచ్చిన నోటీసులను, దరఖాస్తులను తప్పనిసరిగా ఫైల్ చేయాలని సూచించారు. విజయనగరం నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారులకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్‌ఓలదే కీలక పాత్ర అన్నారు. వారు నేరుగా ఎన్నికల కమిషన్‌కు జవాబుదారీ అని స్పష్టం చేశారు. కమిషన్ నిబంధనలను తు.చ తప్పకుండా అమలు చేయాలని వాటికి అనుగుణంగా కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించాలని సూచించారు. ఒక కుటుంబసభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని యువ ఓటర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఓటరుకు కచ్చితమైన చిరునామా, డోర్‌నంబర్ ఉండాలని దీనికి అనుగుణంగా సవరించాలని చెప్పారు. ఈ నెల 21 నుంచి ప్రారంభించనున్న ఇంటింటి సర్వే సమగ్రంగా నిర్వహించాలని, ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ, ఎస్‌డీసీ సూర్యనారాయణ, విజయనగరం తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎన్నికల డీటీలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సర్వం సిద్ధం

- నేటి నుంచి ఆగస్టు 2 వరకు ర్యాలీ
- పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో ఏర్పాట్లు



రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లపై ఆర్మీ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం క్రైమ్: అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఆర్మీ అధికారులతో కలిసి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఈ ర్యాలీ ఆగస్టు రెండో తేదీవరకూ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్‌టీఆర్ జిల్లా వరకూ సుమారు 8,600 మంది అభ్యర్థులు 14 రోజుల పాటు విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఈ ర్యాలీకి హాజరుకానున్నారు. ఇప్పటికే రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పరుగుపందెం, లాంగ్ జంప్, ఇతర శారీరక దారుఢ్య, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆర్మీ అధికారులు తుది ఎంపిక చేస్తారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జేసీ మయూర్ అశోక్, ఆర్మీ రిక్రూటింగ్ అధికారి జీఎస్.రణ్‌ధావా, వినయ్ కుమార్‌లతో కలిసి ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. పరుగుపందెం, నిర్వహణకు మైదానంలో చేసిన ఏర్పాట్లు, బారికేడ్లు, విద్యుత్ దీపాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు ,ఎంపికల నేపథ్యంలో అస్వస్థతకు గురైన అభ్యర్థులకు అత్యవసర వైద్యసదుపాయం, బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి వచ్చే అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లు, వర్షాలు కురిసినట్లయితే పరుగుపందెం నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రదేశాల గుర్తింపు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

అభ్యర్థులకు సదుపాయాలు

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశానికి చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని తెలిపారు. వేదిక వద్దకు చేరుకున్న వెంటనే అభ్యర్థుల ప్రవేశపత్రాలను పరిశీలించి అనంతరం లోపలికి అనుమతిస్తారని, అభ్యర్థులకు 1.6 కిలోమీటర్ల పరుగుపందెం నిర్వహిస్తారని తెలిపారు. ఆర్మీ ప్రమాణాల ప్రకారం ఈ పరుగుపందెంలో ఎంపికైన వారికి లాంగ్ జంప్, మరికొన్ని శారీరక దారుఢ్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు ఉంటాయని చెప్పారు. అనంతరం విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఆర్మీ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు అల్పాహారం, భోజన వసతి సమకూరుస్తున్నామ న్నారు. ఈ ప్రాంత అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్మీకి అధిక సంఖ్యలో ఎంపికవుతారని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటరమణ, డీఈ శ్రీనివాస్, ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

బంగారునాయుడు సేవలు మరువలేం

- ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



బంగారునాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్:

విద్యారంగానికి విశ్రాంత ప్రిన్సిపాల్ బోని బంగారునాయుడు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో విశ్రాంత ప్రిన్సిపాల్ బంగారునాయుడు సంతాప సభ బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్సీ నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత మాస్టారుకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



నూతన అధ్యక్షులను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని బీఎస్ లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం రాత్రి లయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ చంద్రశేఖర్ లయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్‌ల సేవలను కొనియాడుతూ.. క్లబ్ ప్రతినిధులను అభినందించారు. మారుమూల గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషిచేస్తోందని, స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో అదనపు భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

లయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్‌లకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టార్స్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎస్‌వీజీ శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.కిరణ్, కోశాధికారిగా ఒమ్మి రమేష్, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎస్‌వీ దుర్గారావు, కార్యదర్శిగా కోరాడ శంకరరావు, కోశాధికారిగా కె.నాగశంకర్‌లను ఎన్నుకున్నారు. వారితో లయన్స్ క్లబ్ మాజీ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ, ఫేకర్ సీఈ ఎంఎస్ఎస్ శర్మ ప్రమాణం చేయించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, బెల్లాన వంశీకృష్ణ, ఎస్.రాధాకృష్ణ, కందుల పుండరీ తదితరులు పాల్గొన్నారు.